సాక్షి తిరుపతి

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



12న వెంకటగిరిలో జాబ్‌మేళా

వెంకటగిరి విశ్వోదయ కళాశాలలో ఈ నెల 12వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. - 8లో



మిత్రఖేదం!

సర్కారు బడుల్లోని విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన బ్యాగులు నాసిరకంగా ఉండడంతో చిరిగిపోతున్నాయి. - 8లో



గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువెత్తాయి. - 8లో

న్యూస్‌రీల్

టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



స్కూటర్ తాళాలను అందిస్తున్న దాతలు

తిరుమల: విజయవాడకు చెందిన క్వాంటమ్ ఎనర్జీ లిమిటెడ్ ఎండీలు శ్రీనివాస్, చక్రవర్తి సోమవారం రూ.1.05లక్షల విలువైన బిజినెస్ ఎక్స్‌పీ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టీటీడీకి విరాళంగా అందించారు. ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు సమక్షంలో శ్రీవారి ఆలయం ఎదుట స్కూటర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరికి తాళాలు అందించారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్ : పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తిరుపతి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ ఉదయం 4 నుంచి ప్రతి 15 నిముషాలకు ఒక బస్సును తిరుపతి నుంచి నడపనున్నట్లు వివరించారు. అలాగే తిరువణ్ణామలై నుంచి 9వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిరుగు ప్రయాణానికి సర్వీసులు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

నేడు పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : జిల్లాలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆయా గ్రూప్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల సంఖ్య మేరకు ఇప్పటికే స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు, ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు సైతం ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావచ్చని అధికారులు వెల్లడించారు.

టీటీడీ ఆలయాలకు 'సౌభాగ్యం'




సామగ్రిని పరిశీలిస్తున్న సిబ్బంది

తిరుపతి అన్నమయ్యసర్కిల్: టీటీడీ పరిధిలోని 51 ఆలయాల్లో ఈ నెల 8వ తేదీన వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వ్రతంలో పాల్గొన్న మహిళలకు సౌభాగ్యం పేరుతో గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు సౌభాగ్యం వస్తు సామగ్రిని ఆయా ఆలయాలకు చేర్చినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ఆలయాల్లో సౌభాగ్యవతులకు గాజులు, పద్మావతి అమ్మవారి కుంకుమ అందించనున్నట్లు వెల్లడించారు.

అయ్యో.. రొయ్య





రొయ్యల ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో ఆక్వా రైతులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. అమెరికా సుంకం పేరుతో అన్ని కౌంట్ల రేట్లను వ్యాపారులు భారీగా తగ్గించేయడంతో దిగాలు పడుతున్నారు. టన్నుపై దాదాపు రూ.50వేల నుంచి రూ.80వేల వరకు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ట్రంప్ విధించిన పన్ను ఎగుమతులపై ప్రభావం చూపించడంతో కొనుగోళ్లు తగ్గిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా స్థానిక వ్యాపారులు నిలువు దోపిడీకి తెరతీస్తున్నారని మండిపడుతున్నారు. ఒకప్పుడు సిరులు పండించిన రొయ్యల సాగు.. ఇప్పుడు అప్పుల్లోకి నెట్టేస్తోందని వాపోతున్నారు.

ధరల పతనం ఇలా..

కౌంటు	గురువారం వరకు ధర	ప్రస్తుత ధర
100	రూ.270	రూ.230
90	రూ.280	రూ.240
80	రూ.300	రూ.260
70	రూ.320	రూ.280
60	రూ.340	రూ.300
50	రూ.360	రూ.320
40	రూ.390	రూ.360
30	రూ.470	రూ.420

కుదేలైన ఆక్వా రంగం

- అమెరికా సుంకం దెబ్బకు ధరలు పతనం
- టన్నుపై సుమారు రూ.50వేల వరకు నష్టం
- దిక్కుతోచని స్థితిలో రైతాంగం
- పట్టించుకోని ప్రభుత్వం

వాకాడు : జిల్లాలో ఆక్వా రంగం ఇప్పటికే ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. తాజాగా మన దేశ ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకం మరింత దెబ్బతీసింది. కేవలం 48 గంటల్లోనే రొయ్యల ధరలను ఒక్కసారిగా కింద పడేసింది. మన దేశంలో లభించే ఆక్వా ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. అయితే ఒక్క అమెరికా సుంకం సాకు చూపి అన్ని కౌంట్ల ధరలను తగ్గించేయడంతో రొయ్యల సాగు చేసిన రైతులు విలవిలలాడుతున్నారు. ప్రధానంగా మనదేశంతోపాటు ఈక్వెడార్‌లో సాగు చేసే రొయ్యలకే అమెరికాలో మంచి డిమాండ్ ఉంటుంది. భారత్ ఉత్పత్తులపై 25 శాతం సుంకం విధించి, ఈక్వెడార్ ఉత్పత్తులపై కేవలం 10 శాతం సుంకం విధించడం మన దేశ ఆక్వా రంగంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది.

రసాయనాలు వాడితే రిటర్న్

యూరప్‌లోని 10 దేశాల్లో ఆంధ్రా రొయ్యలకు మంచి డిమాండ్ ఉంది. అయితే కొంత మంది రైతులు నిషేధిత యాంటీ బయోటిక్స్‌ను సాగులో వాడడం యూరోపియన్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. కృష్ణపట్నం, విశాఖపట్నం, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతి అవుతున్న ప్రతి రెండు కంటైనర్‌లో ఒకదానికి శాంపిల్స్ తీస్తున్నారు. రసాయన అవశేషాలు ఉన్నట్లు తేలితే ఎగుమతులు చేసే లైసెన్సులను రద్దు చేసేస్తున్నారు. అలాగే రొయ్య ఉత్పత్తులను వెంటనే రిటర్న్ పంపేస్తున్నారు.

గడ్డు పరిస్థితి

సిరుల పంటగా పేరొందిన ఆక్వా సాగుకు ఇప్పుడు గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. భారతదేశం నుంచి వచ్చే సరుకులపై అమెరికా విధించిన 25శాతం సుంకంతో ఆక్వా సాగు మరింత డీలా పడింది. ప్రస్తుతం రూ. 270 ఉన్న వంద కౌంటు రొయ్యల ధర కొత్త సుంకం విధించిన 48 గంటల్లోనే రూ.230కి ధర పడిపోయింది. జిల్లాలో వాకాడు, కోట, చిల్లకూరు, గూడూరు, చిట్టమూరు, తడ, సూళ్లూరుపేట మండలాల్లో దాదాపు 28 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఇక్కడి నుంచి 70 శాతం రొయ్యలు అమెరికాకు ఎగుమతవుతుంటాయి. ట్రంప్ విధించిన సుంకం సాకుగా చూపించి జిల్లా వ్యాపారులు కొన్ని కౌంట్లుపై రూ. 50 నుంచి రూ. 80 వరకు తగ్గించారు. దీంతో టన్నుపై రూ. 50 వేలు నుంచి రూ. 80 వేలు వరకు రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

స్టోరేజీ సౌకర్యం లేక ఇబ్బందులు

జిల్లా నుంచి లక్షల టన్నుల రొయ్యలను రైతులు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ వాటిని నిల్వ చేసుకునే స్టోరేజీలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎకరాకు రూ. 2 లక్షల వరకు ఖర్చు చేస్తున్న రైతులు చివరకు నష్టాలనే మూటగట్టుకోవాల్సి వస్తుంది. ఇక కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

సర్కారు స్పందించేనా..?

అంతర్జాతీయ మార్కెట్‌లో రొయ్యల ధర ఆశాజనకంగా లేనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించాల్సిన అవసరముంది. ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ఆ దిశగా కూటమి సర్కారు స్పందిస్తుందా అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో వ్యయప్రయాసలకు ఓర్చి 90 రోజులు కష్టపడినప్పటికీ నష్టపోయే దుస్థితి దాపురించిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. నాసిరకం సీడ్, ఫీడ్‌తోపాటు ప్రకృతి వైపరీత్యాలతో తల్లడిల్లుతుంటే ఇప్పుడు అమెరికా సుంకం పేరుతో అప్పుల ఊబిలోకి వెళ్లిపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కొందరు వ్యాపారులు సిండికేట్‌గా మారి నిలువునా దోచేసుకుంటున్నారని వాపోతున్నారు. గత ఏడాది రొయ్యల ధరలతో లెక్కిస్తే రూ.4 వేల కోట్లు ఆధాయం రావాల్సి ఉండగా, ప్రస్తుత ధరలతో అది రూ. 3.5 వేల కోట్లకు పడిపోతోందని వెల్లడిస్తున్నారు.



తక్కువ ధరకే రొయ్యలను విక్రయిస్తున్న రైతులు

చైనా మార్కెట్‌పై దృష్టి

గత ఏడాది వరకు జిల్లాలోని ఆక్వా రైతులు అమెరికా ఎగుమతికి మొగ్గు చూపేవారు. అయితే అమెరికా రెండు సార్లు సుంకం విధించడంతోపాటు రసాయన అవశేషాలు ఉన్నాయంటూ రొయ్యలను పలుమార్లు తిప్పి పంపేశారు. దీంతో వ్యాపారులు చైనా మార్కెట్‌పై దృష్టి సారించారు. ఈ క్రమంలో 50 కౌంటు కన్నా తక్కువ ఉన్న రొయ్యల కొనుగోలును ప్రాసెసింగ్ యూనిట్ యజమానులు, ఎగుమతి దారులు నిలిపేశారు. 50 కౌంటుకు మించి ఉన్న రొయ్యల కొనుగోలుకే మొగ్గుచూపుతున్నారు. దీంతో స్థానిక వ్యాపారులు రంగంలోకి దిగి 50,60,70,80,90,100 కౌంటు రొయ్యలను ధరలు తగ్గించి కొంటున్నారు.



కృష్ణపట్నం పోర్టులో ఎగుమతికి సిద్ధం రొయ్యల కంటైనర్‌లు

ఏటా 1.25 లక్షల టన్నుల ఎగుమతి

జిల్లా నుంచి ఏటా 1.25 లక్షల టన్నుల రొయ్య ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా, చైనా, సౌత్ ఈస్ట్ ఏషియన్ దేశాలు, యూరోపియన్, జపాన్ దేశాలకు కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, చెన్నై పోర్టుల నుంచి కంటైనర్‌ల ద్వారా ఎగుమతులు జరుగుతుంటాయి. ఒక్కో కంటైనర్‌లో సైజు మేరకు 60 నుంచి 100 టన్నుల తొక్కతీసిన రొయ్యల మాంసం స్మార్ట్ ప్యాకింగ్ ద్వారా తరలిస్తుంటారు.

చితికిపోతున్నాం



ట్రంప్ విధించిన సుంకంతో 48 గంటల్లోనే 100 కౌంట్ రొయ్యలపై రూ.40లు తగ్గిపోయింది. అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రొయ్యలకు సరైన ధర లభించకపోవడంతో చితికిపోతున్నాం. ప్రస్తుతం ఆక్వా రంగంలో విద్యుత్ బిల్లులు పెరిగాయి. ఫీడ్ ధరలు టన్నుపై రూ. 20 వేలు పెరిగినాయి. దీంతో అప్పులే మిగులుతున్నాయి.

– ఎస్.మధురెడ్డి, ఆక్వా రైతు, ముట్టెంబాక

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆక్వా పెట్టుబడి అమాంతంగా పెరిగిపోయింది. రూ.లక్షలు వెచ్చించి 95 రోజులు కష్ట పడితే రొయ్యలు ఒక సైజ్‌కు వస్తాయి. అయితే ఇప్పుడు కొనుగోలుదారులు ఒక్కసారిగా రొయ్యల రేట్లు తగ్గించేశారు. ఒకప్పుడు 30 కౌంటు రూ.600 పలికితే, ఇప్పుడు రూ.470కి పడిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– పాకం చెంగయ్య, ఆక్వా రైతు, పల్లెపాళెం

సిఫార్సు ఉంటేనే పింఛన్!

చిల్లకూరు: వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వస్తే కూటమి నేతల సిఫార్సు లేఖను అడిగారని ముత్యాలపాడు, నాంచారమ్మ పేటకు చెందిన ఐదుగురుమహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ముత్యాలపాడు సచివాలయానికి వితంతు పింఛన్‌కు స్పౌజ్ కింద దరఖాస్తు చేసుకునేందుకు వెళితే వెల్ఫేర్ అసిస్టెంట్ స్థానిక కూటమి నేత నుంచి సిఫార్సు లేఖ తెస్తేనే దరఖాస్తు చేస్తామని తెగేసి చెప్పినట్లు వాపోయారు. ఈ మేరకు ఎంపీడీఓ గోపిని వివరణ కోరగా వెల్ఫేర్ అసిస్టెంట్‌తో మాట్లాడి దరఖాస్తు చేయిస్తామని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల:తిరుమల శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆరు కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు 82,628 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,339 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి హుండీ ద్వారా రూ.4.25 కోట్ల ఆదాయం వచ్చింది.

యోగాతో ఆరోగ్యకర జీవనం



విజేతలతో నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్ : యోగాతోనే ఆరోగ్యకర జీవనం సాధ్యమని డీఎస్పీ బాలిరెడ్డి, స్విమ్స్ కార్డియాలజిస్ట్ వనజ తెలిపారు. యోగాజన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తిరుపతి అధ్వర్యంలో విద్యోదయ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌లో సోమవారం జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన బాలిరెడ్డి, వనజ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. 10 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వారికి ట్రెడిషనల్ యోగాసన, ఆర్టిస్ట్ యోగాజన, రిథమిక్ యోగాజనతో పాటు వేర్వేరుగా 10 విభాగాలలో చేపట్టిన ఈ పోటీలకు సుమారు 130 మంది యోగా సాధకులు హాజరయ్యారు. విజేతలను ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర యోగా పోటీలకు ఎంపిక చేసినట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాసింగ్ రాజపురోహిత్ తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు అమర్‌నాథ్, ఓటేరు కృష్ణ, ప్రధాన కార్యదర్శి ముని మంజుల, సహాయ కార్యదర్శి సుబ్రమణ్యం స్టేట్ అబ్జర్వర్ పెంచలయ్య, డీవైఈఓ బాలాజీ పాల్గొన్నారు.

అన్నదాతకు తప్పని ఆందోళన

- బాబు పాలనలో రోడ్డున పడిన రైతులు
- ఒక వైపు ఎరువుల కొరత.. మరోవైపు లేని గిట్టుబాటు ధర
- పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించిన భూమన కరుణాకరరెడ్డి
- ప్రజా సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన
- వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న భూమన, నారాయణస్వామి, సిపాయి, మధుసూదన్‌రెడ్డి, శిరీష, రాజేష్ తదితరులు

తిరుపతి అర్బన్ : చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పేది ఒకటి.. అధికారంలోకి వచ్చిన తర్వాత చేసేది మరొకటని, కూటమి పాలనలో రైతులను రోడ్డున పడేశారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి మేయర్ శిరీషా, వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్, శ్రీకాళహస్తీశ్వర ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, తిరుపతి నగర పార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్ వంశీతో కలసి హాజరయ్యారు. గ్రీవెన్స్‌లో డీఆర్‌ఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. జిల్లాలో ఎరువుల కొరతను వివరించారు. తక్షణం సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పీజీఆర్‌ఎస్‌లో ఎరువుల కొరతపై వినతిపత్రం ఇచ్చామన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు పెట్టుబడి సాయంగా ఒక్కో రైతుకు రాష్ట్రం తరఫున రూ.20వేలు అందిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ఇప్పుడు కేంద్రం మూడు విడతల్లో రూ.6వేలు ఇస్తుందని, రాష్ట్రం రూ.14 వేలు మాత్రమే భరిస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అదీ ఏడాది తర్వాత రైతులకు కేవలం రూ.5వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దీనికితోడు కుంటి సాకులతో రాష్ట్రవ్యాప్తంగా 7లక్షల మందికి రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయకుండా ఎగనామం పెట్టారని ఆరోపించారు. ఈ క్రమంలోనే కాంప్లెక్స్ ఎరువుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ప్రధానంగా యూరియా లేకపోవడంతో అన్నదాతలు నానా కష్టాలు పడుతున్నారని వివరించారు. 13.5లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువుల అవసరం ఉందని, 2లక్షల టన్నుల నిల్వలను అందుబాటులో ఉంచుకునేందుకు బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయింపు చేయాల్సి ఉండగా, కేవలం రూ.40కోట్లు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించలేదని చెప్పారు. తోతాపురి మామిడికి గత వైఎస్సార్‌సీపీ సర్కార్‌లో కేజీకి రూ.29 చొప్పున ఇస్తే.. చంద్రబాబు ప్రభుత్వం రూ.2 ఇవ్వడమే గగనంగా మారిందన్నారు. టమాటాకు ధరలు లేకపోవడంతో రైతులు రోడ్లపై పోయాల్సిన దుస్థితి దాపురించిందని వివరించారు. మిర్చి, పొగాకు పంటలకు గిట్టుబాటు ధరలు లేని వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా రైతు భరోసా కేంద్రంలో పంపిణీ చేశామని తెలిపారు. అలాగే క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అర్హులైన రైతులు అందరికీ అందించామని వెల్లడించారు. రైతులకు ఉచిత బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీలేని రుణాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు మాధవీరెడ్డి, రైతు అనుబంధ సంఘాల జిల్లా నాయకుడు చంద్రమౌళేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమనకు సమస్యలు ఏకరవు పెట్టిన జనం

కలెక్టరేట్‌లో భూమన కరుణాకరరెడ్డిని పలువురు అర్జీదారులు కలిశారు. ఆయనకు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. ఎన్నిసార్లు అర్జీలు సమర్పించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల సమస్యలపై భూమన స్పందించారు. పరిష్కారం చూపించేందుకు అధికారులతో మాట్లాడతామని భరోసా ఇచ్చారు. భూమనతో అర్జీదారుల ఆవేదన ఇలా..

- బాలాయపల్లె మండలంలోని వాక్యం గ్రామానికి చెందిన విజయమ్మ, రాధ,రాజేశ్వరి, రామాదేవి తదితర మహిళా రైతులు తమ ఊరిలో టీడీపీ నేత గెరటయ్య 111 సర్వే నంబర్‌లోని తమ 8.78 ఎకరాల భూమిని ఆక్రమించారని, తమకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతోనే కబ్జాకు పాల్పడినట్లు వివరించారు.
- ఈ ఏడాది మార్చిలో తన భర్త లక్ష్మన్న మృతి చెందాడని, వితంతు పింఛన్ మంజూరు చేయాలని వస్తే అధికారులు పట్టించుకోవడం లేదని తిరుపతి అర్బన్‌లోని తిరుమల నగర్‌కు చెందిన సుబ్బమ్మ అనే మహిళ వాపోయారు.
- తిరుపతి నగరంలోని 3వ వార్డుకు చెందిన ఝాన్సీలక్ష్మీబాయ్ సమాఖ్య పరిధిలో 34 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని, అందులో 340 మందిని సభ్యులుగా ఉన్నట్లు పొదుపు మహిళలు తెలిపారు. తమ సొమ్ము రూ.1.20 కోట్లను ఆర్‌పీ లత స్వాహా చేశారని తమకు న్యాయం చేయాలని విన్నవించారు.
- పింఛన్ మంజూరు చేయడం లేదని తిరుపతి పద్మానగర్‌కు చెందిన షాజహాన్ అనే దివ్యాంగురాలు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు తిరిగినా ట్రైసైకిల్ ఇవ్వడం లేదని నరసింహారావు అనే దివ్యాంగుడు వాపోయారు.
- ఈ సమస్యలపై భూమన స్పందించారు. కలెక్టరేట్‌లో అరగంట ఉంటేనే ఇన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న భూమన




దివ్యాంగులను పలకరిస్తూ..

'గురుకుల'ంలో ప్రవేశానికి అవకాశం

తిరుపతి సిటీ: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పలు తరగతులకు సంబంధించి ప్రవేశానికి అవకాశం కల్పించినట్లు పాఠశాలల జిల్లా సమన్వయాధికారి పద్మజ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ చిల్లకూరు పాఠశాలలో 5వ తరగతిలో బాలురుకు 4 సీట్లు, నాయుడు పేటలో బాలురకు 79 సీట్లు ఉన్నాయని తెలిపారు. అలాగే చిల్లకూరులో బాలురకు ఇంటర్ ఎంపీసీలో 13, బైపీసీలో 16, నాయుడు పేటలో బాలురకు ఎంపీసీలో 16, బైపీసీలో 26, వాకాడులో బాలురకు ఎంఈసీలో 25, సీఈసీలో 3, పుత్తూరులో బాలికలకు సీఈసీలో 20సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు బుధవారం సాయంత్రంలోపు ఆయా పాఠశాలలోని ప్రిన్సిపాళ్లను నేరుగా కలిసి ప్రవేశాలు పొందాలని సూచించారు.

ఆత్మవిశ్వాసంతోనే లక్ష్య సాధన



మాట్లాడుతున్న వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి

తిరుపతి కల్చరల్ : ఆత్మవిశ్వాసంతోనే లక్ష్యాలను సాధించవచ్చని, ఆ దిశగా మహిళలు ప్రయత్నించాలని స్విమ్స్ మాజీ డైరెక్టర్ బి.వెంగమ్మ పిలుపునిచ్చారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమ దశమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఆశ్రమంలోని వివేకానంద సమావేశ మందిరంలో యువజన సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంగమ్మ మాట్లాడుతూ మహిళలకు విద్యావకాశం కల్పించడమే వివేకానందుడి లక్ష్యమని తెలిపారు. జీవన విధానం సమతుల్యంతో సాగాలంటే ఆత్మవిశ్వాసం అవసరమన్నారు. మనసును పాజిటివ్ ఆలోచనలకు అలవాటు చేయాలని కోరారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. గౌరవ అతిథి ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందని తెలిపారు. అనంతరం నెల్లూరు రామకృష్ణ మిషన్ కార్యదర్శి హృదానందజీ మహరాజ్, రుయా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నిర్మల, రామకృష్ణ మిషన్ విజయవాడ సహాయ కార్యదర్శి శితికంఠానందజీ మహరాజ్ మాట్లాడారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్సపొందుతూ మహిళ మృతి


సుబ్బమ్మ(ఫైల్)

దొరవారిసత్రం : ఆత్మహత్యకు పాల్పడిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. వివరాలు.. డీవీ సత్రం మండలం మినమలముడి గ్రామానికి చెందిన నల్లపాటి సుబ్బమ్మ(50) శనివారం పురుగుల మందు తాగేసింది. స్థానికులు గమనించి తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ మరణించింది. సోమవారం ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో దిక్కుతోచక సుబ్బమ్మ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు వెల్లడించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. డీవీ సత్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు 10 మేకలు మృతి

- మేకల కాపరికి స్వల్ప గాయాలు

ఏర్పేడు: మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన భీమవరం పెంచలయ్యకు చెందిన 10 మేకలు సోమవారం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. సోమవారం సాయంత్రం పెద్ద ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో గ్రామ శివారులో మేకలను మేపుకుంటున్న పెంచలయ్యతో పాటు మేకలు చెట్టు కింద చేరాయి. అకస్మాత్తుగా పెద్ద ఉరుములతో కూడిన పిడుగు చెట్టుపై పడింది. దీంతో 10మేకలు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. పెంచలయ్యకు స్వల్పంగా షాక్ తగిలింది. అతనికి ప్రథమ చికిత్స అందించడంతో సురక్షితంగా బయటపడ్డాడు. నిరుపేద రైతు మేకలు పిడుగుపాటుకు మృతి చెందడంతో రూ.1.5లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

గూడూరు రూరల్ : గాంధీనగర్‌లో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన ఇంట్లో నిల్వ ఉంచిన 65 రేషన్ బియ్యం బస్తాలను విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దాడిలో విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణనాయక్, వీఆర్‌ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఆరుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి ఆలయంలో బంగారు చైన్‌ను లాక్కెళ్లిన కేసులో ఆరుగురికి 15 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి కోటేశ్వరరావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గత నెల 26వ తేదీ తిరుమలలో తమిళనాడుకు చెందిన ఓ భక్తురాలి మెడలో బంగారు గొలుసు అపహరణకు గురైంది. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి మహారాష్ట్రకు చెందిన అర్జున్ లక్ష్మణ్ మాసాలకర్, భగవాన్ బాబురావు గైక్వాడ్, వికాస్ విజయ్ జాదవ్, గణేష్ సునీల్ గైక్వాడ్, గైక్వాడ్ ఆకాష్ బాబు, రవి జనార్దన్ జాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

మిత్రభేదం!


పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు

“ సర్కారు బడుల్లోని పిల్లలకు నాణ్యమైన విద్యా సామగ్రి పంపిణీ చేశాం. ఆకట్టుకునేలా బ్యాగులను తయారు చేయించాం. విద్యార్థుల సౌకర్యానికి పెద్దపీట వేశాం'' అంటూ అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ ఆర్భాటంగా ప్రకటించారు. ప్రభుత్వం సరఫరా చేసిన బ్యాగులను చూపిస్తూ గొప్పలు చెప్పుకున్నారు. అయితే వారం.. పది రోజులకే బండారం బట్టబయలైంది. ప్రధానంగా స్కూలు బ్యాగుల నాణ్యత.. మంత్రి మాటల్లోని డొల్లతనం ప్రజలకు అర్థమైంది. కొద్ది పుస్తకాల బరువుకే సంచులు చిరిగిపోవడంతో విద్యార్థులకు దిక్కుతోచని దుస్థితి దాపురించింది.

- నాణ్యత లేని విద్యార్థి మిత్ర కిట్‌లు
- వారం.. పది రోజులకే చిరిగిపోయిన బ్యాగులు
- అవస్థలు పడుతున్న పిల్లలు
- నాసిరకమని ఆరోపిస్తున్న తల్లిదండ్రులు

వరదయ్యపాళెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌ల ద్వారా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూలు బ్యాగు, యూనిఫామ్ పంపిణీ చేశారు. మండలంలోని మొత్తం 59 సర్కారు బడుల్లోని 3,646 మంది విద్యార్థులకు కిట్లను అందజేశారు. అయితే వారం, పది రోజులకే చాలా మంది విద్యార్థుల బ్యాగులు చిరిగిపోయాయి. చిరిగిన బ్యాగుల్లో పుస్తకాలు తీసుకు రావడానికి పిల్లలు అవస్థలు పడుతున్నారు. పలువురు ఇప్పటికే ప్రత్యామ్నాయంగా బ్యాగులు కొనుగోలు చేసుకుని పుస్తకాలను స్కూల్‌కు తీసుకెళుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేసిన విద్యాకానుక కిట్లలో నాణ్యత లోపించి డొల్లతనం బయట పడింది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల నుండి సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో కేవలం ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణలో చిత్తశుద్ధి లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద విద్యార్థులు ఇస్తున్న కిట్లలో కూడా కక్కుర్తి పడడమేంటని ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన స్కూలు బ్యాగులు ఎంతో నాణ్యతగా ఉండేవని, ఏడాదంతా ఒకే బ్యాగులో పుస్తకాలు తీసుకువెళ్లిన ఏమాత్రం చిరిగేవి కాదని గుర్తు చేసుకుంటున్నారు.

కుట్లు వేసినా ప్రయోజనం శూన్యం

ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ బ్యాగుల నాణ్యతను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాగుల తయారీకి ఉపయోగించిన మెటీరియల్ పూర్తిగా నాసిరకంగా ఉండడంతో కుట్లు వేసినా చిరిగిపోతున్నాయని పలువురు టైలర్లు చెబుతుండడం గమనార్హం.

తెగిపోయింది



పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ ద్వారా స్కూలు బ్యాగు ఇచ్చారు. తీసుకున్న వారం రోజులకే బ్యాగు తగిలించుకునే కాడ తెగిపోయింది. దీంతో ప్రత్యామ్నాయంగా మరో బ్యాగును ప్రైవేటు దుకాణంలో కొనుగోలు చేసి రోజువారీ పాఠ్య పుస్తకాలు తీసుకెళుతున్నా.
– వేల్‌మురుగన్, విద్యార్థి

గతంలోని బ్యాగునే వాడుతున్నా



నాకు ఇచ్చిన బ్యాగు పది రోజులకే పూర్తిగా చిరిగిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండేళ్ల క్రితం జగనన్న విద్యా కానుక కింద ఇచ్చిన బ్యాగునే ఇప్పుడు వాడుతున్నా. ఇప్పటికీ ఆ బ్యాగు చక్కగా ఉంది. ఎన్ని పుస్తకాలు తీసుకెళ్లినా చెక్కు చెదరలేదు.
– సుదర్శన్, విద్యార్థి

చిరిగిపోయింది



నేను పాండూరు హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నా. ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగు పది రోజులకే జిప్పు పైభాగంలో చిరిగిపోయింది. ఆ బ్యాగులో పుస్తకాలు తీసుకు రావడం ఇబ్బందికరంగా ఉంది. ఎప్పుడు పూర్తిగా చిరిగిపోతుందో అని భయంగా ఉంది.
– చంద్రశేఖర్, విద్యార్థి

మఠం భూమిపై ‘పచ్చ’గద్దలు


హథీరాంజీ మఠం భూమిని చదును చేస్తున్న దృశ్యం

శ్రీవారికి పరమభక్తుడైన హథీరాం బావాజీ మఠానికి చెందిన భూములపై పచ్చ నేతలు కన్నేశారు.. ఇప్పటికే 30 మంది పేదలు నిర్మించుకున్న రేకుల షెడ్లను నిర్దాక్షిణ్యంగా కూలదోసేశారు. అక్రమంగా ఆ భూమిలోకి ప్రవేశించి యథేచ్ఛగా స్థలం చదును చేసేశారు. గూడు కోల్పోయిన బాధితులను పోలీసుల సాయంతో అడ్డుకున్నారు. ఖాకీలు సైతం పచ్చమూక దౌర్జన్యానికి సహకారం అందించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- రూ.6కోట్ల విలువైన స్థలం చదును
- 30 మంది పేదల ఇళ్లు ధ్వంసం
- బాధితుల గోడు పట్టించుకోని పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 13లో 1.09ఎకరాల భూమిపై చంద్రగిరి మండలానికి చెందిన ఒక టీడీపీ నేత కన్నుపడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయనకు స్థానిక ముఖ్యప్రజాప్రతినిధి అండగా నిలబడటంతోనే పేదల ఇళ్లు కూల్చివేశారని వెల్లడిస్తున్నారు. ఎంతో కాలంగా ఆ భూమిలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారిపై దౌర్జన్యం చేసి ఆక్రమించారని స్పష్టంచేస్తున్నారు. మఠం భూములపై ఎవరికీ ఎలాంటి హక్కులు లేనప్పటికీ పోలీసులు మాత్రం టీడీపీ నేతలకు అండగా నిలుస్తున్నారని మండిపడుతున్నారు. పైగా పచ్చనేతల వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని, పేదల వద్ద అన్ రిజిస్టర్ డాక్యు మెంట్లు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారని విమర్శిస్తున్నారు. మఠం భూమిపై ఎవరికీ హక్కు లేనప్పుడు, ఇప్పటికే ఆ స్థలంలో ఇళ్లు కట్టుకున్న వారిని కాదని, టీడీపీ నేతలు ఎలా ఆ అందులోకి ప్రవేశిస్తారని ప్రశ్నిస్తున్నారు. 30 మంది ఇళ్లను కూల్చి ఆ భూమిని కాజేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దౌర్జన్యంగా ఆక్రమించి చదును చేయడం దుర్మార్గమని బాధితులు ఆరోపిస్తున్నారు. తమకు జరిగిన అన్యాయంపై ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు. మఠం అధికారులు సైతం ఈ విషయంలో పేదల పక్షాన నిలబడాలని కోరుతున్నారు.

తండ్రీ కొడుకుల నిర్వాకం.. విద్యార్థుల పాలిట శాపం

- మాజీ మంత్రి ఆర్కేరోజా


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ నిర్వాకం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మాజీ మంత్రి ఆర్కే రోజా ధ్వజమెత్తారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. జగనన్న పాలనలో ప్రతి విద్యార్థికీ ఒక్క ఏడాది కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ కష్టం రాకుండా జాగ్రత్తపడ్డారని తెలిపారు. కానీ ప్రస్తుత పాలనలో, విద్యాశాఖ మంత్రిగా లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో జిల్లాలో సుమారు 600 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక, యూనివర్సిటీలు సర్టిఫికెట్లు ఇవ్వక ఉన్నత విద్య అయిన ఎంటెక్ అవకాశాన్ని కోల్పోయారని మండిపడ్డారు. రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెడుతూ, పథకాన్ని నీరుగార్చడంతో పాటు వారి భవిష్యత్తునే నాశనం చేస్తున్నారన్నారు. ‘మూలనున్న ముసలమ్మ కూడా బటన్ నొక్కుతుంది’ అని డైలాగ్‌లు చెప్పిన వాళ్లు నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బటన్ నొక్కడానికి ఎందుకింత కష్టపడుతున్నారన్నారు. పాలన ఇలాగే కొనసాగితే ప్రభుత్వం విద్యార్థుల ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు.

లారీని ఢీకొన్న బైక్


లారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు


చెల్లాచెదురుగా మృతదేహాలు

- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- మృతులు బంగారుపాళ్యం వాసులుగా గుర్తింపు


ప్రమాదంలో మృతి చెందిన పరంధామ, హరీష్ నాయుడు

చంద్రగిరి: ఎదురుగా వస్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండలం, తంబుగానిపల్లికి చెందిన పరంధామ(26) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో సోమవారం రాత్రి తిరుపతికి పయనమయ్యాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గడ్డం హరీష్ నాయుడు(24) తన తల్లితో కలసి కాణిపాకంలో ఉంటూ డ్రైవరుగా జీవనం సాగిస్తున్నాడు. కాణిపాకానికి చేరుకున్న పరంధామ, హరీష్ నాయుడును తన ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని ఇద్దరూ తిరుపతికి పయనమయ్యారు. పనపాకం టోల్‌ప్లాజా దాటుకుని వస్తున్న క్రమంలో ఎదురుగా తిరుపతి నుంచి చిత్తూరు వైపుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పరంధామతో పాటు హరీష్ నాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. హైవే పోలీసులు లారీ డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతోనే..

పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు ఆగిపోవడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. రహదారి పనులు పనపాకం నుంచి జక్కలవారిపల్లి వరకు సుమారు కిలోమీటర్ మేర గత కొన్నేళ్లుగా ఆగిపోయాయి. దీంతో రహదారి విస్తరణ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక సింగిల్ రోడ్డును ఏర్పాటు చేశారు. ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాదారులకు సింగిల్ రోడ్డు అన్న విషయం తెలియకపోవడంతో, మలుపు తీసుకోకుండా నేరు వెళ్లి లారీని ఢీకొట్టారు. ఇకనైనా రహదారి విస్తరణ అధికారులు స్పందించాల్సి ఉంది.

అబద్ధాలతోనే ‘నాని’ రాజకీయం

- ఎమ్మెల్యే అయినా తీరుమారలేదు
- మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చంద్రగిరి: ఎమ్మెల్యే పదవి కోసం గత ఎన్నికల సమయంలో పులివర్తి నాని అబద్ధాలతో రాజకీయం చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి నేతలు మండిపడ్డారు.ఎల్లో మీడియా, సోషల్ మీడియా ద్వారా అసత్యాలను ప్రచారం చేయించారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తన చిల్లర బ్యాచ్‌తో దాడులకు పాల్పడుతూ రాక్షసానందం పొందుతున్నారని ఆరోపించారు. సోమవారం వారు చంద్రగిరిలోని ఓ కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రగిరి చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ఏడాది పాలనలో సుమారు 50 మంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై భౌతిక దాడులు చేయించారన్నారు. పల్లెల్లో జరిగే రాజకీయ గొడవలు, హత్యాయత్నాల కారణంగా చంద్రగిరి పరువుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంయమనం పాటించాలని చెవిరెడ్డి చెప్పడం వల్లే మీరు కూడా ప్రశాంతంగా పల్లెల్లో తిరుగుతున్నారని వెల్లడించారు. ఎమ్మెల్యే గెలిచిన తర్వాత కూడా ప్రజలను ఎన్నాళ్లు మోసం చేస్తారని ప్రశ్నించారు. చెవిరెడ్డిపై మీరు చేస్తున్న అసత్య ఆరోపణలను రుజువు చేసే దమ్ముందా అని నిలదీశారు. అడుగడుగునా అవినీతి, అక్రమాలకు తెరలేపి రూ.కోట్ల ప్రజాధనం దోచేస్తున్నారని ఆరోపించారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ


అంకురార్పణ చేస్తున్న దృశ్యం

తిరుమల: శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలకు సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ముందుగా సేనాధిపతిని ఊరేగింపుగా వసంతమండపానికి వేంచేపు చేశారు. అనంతరం మృత్సంగ్రహణం, ఆస్థానం చేపట్టారు. పవిత్ర మండపంలో అంకురార్పణ వైదిక కార్యక్రమాలు జరిపించారు. టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

భాకరాపేట: శేషాచల అడవుల్లోని భాకరాపేట అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి వచ్చిన రహస్య సమాచారం మేరకు అయ్యగారిపల్లి సమీపంలో అనుమానిత కారు రావడంతో తనిఖీ చేయగా అందులో 9 ఎర్రచందనం దుంగలు పట్టుకున్నారు. వెంటనే ఎర్రచందనం దుంగలను కారును, డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని భాకరాపేట అటవీ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ రూ.11 లక్షలు ఉంటుందని తెలిపారు. మరియు కార్ డ్రైవర్ తమిళనాడు వాసి ప్రకాష్ శక్తివేల్‌గా గుర్తించారు. మరొకరు పారిపోగా పోలీసులు గాలిస్తున్నారు. భాకరాపేట రేంజ్ అటవీ క్షేత్రాధికారి ఎస్ వెంకటరమణ, బి మునిస్వామి నాయక్ ఎఫ్ఎస్ఓ, వై రాజేష్ కుమార్, ప్రదీప్ చాంద్, కె లక్ష్మీప్రసాద్ ఎఫ్‌బీఓలు శంకర్, రోహిత్ పాల్గొన్నారు.

నేడు ఐసర్ 6వ స్నాతకోత్సవం


తిరుపతి ఐసర్

ఏర్పేడు: మండలంలోని తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్)లో మంగళవారం ఉదయం 9.30 గంటలకు 6వ స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతాను భట్టాచార్య తెలిపారు. ఐసర్ ప్రాంగణంలోని ఆడిటోరియంలో నిర్వహించే ఈ వేడుకలో కోర్సు పూర్తి చేసిన మొత్తం 255 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు వివరించారు. పట్టాలు అందుకోనున్న విద్యార్థుల్లో 22 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, 8మంది ఐపీహెచ్‌డీ విద్యార్థులు, ముగ్గురు ఎంఎస్ విద్యార్థులు, 141 మంది బీఎస్–ఎంఎస్ విద్యార్థులు, 69 మంది ప్రొఫెషనల్ మాస్టర్స్ విద్యార్థులు, ఆరుగురు బీఎస్ విద్యార్థులు, మరో ఆరుగురు బీఎస్సీ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా గోదావరి బయోరిఫైనరీస్ చైర్మన్ సమీర్ సోమైయా, ఐజర్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్‌గా ఝిల్లుసింగ్ యాదవ్ పాల్గొంటారన్నారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఈ వేడుకల్లో పాల్గొంటారని ఆయన వివరించారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి అర్బన్ : సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా అధికారులు పనిచేయాలని జేసీ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 302 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. డీఆర్‌ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోస్మాండ్, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు..

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం : ఎస్పీ

ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి తగు న్యాయం చేస్తామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. సోమవారం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా 102 అర్జీలు వచ్చాయి. అదనపు ఎస్పీలు రవిమనోహరచారి,నాగభూషణం, డీఎస్పీ వెంకటనారాయణ, సాధిక్ ఆలీ, సీఐలు శ్రీనివాసులు, మురళికృష్ణ,నాగార్జునరెడ్డి,హరిప్రసాద్,శ్రీరాములు, మంజునాథ్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

12న వెంకటగిరిలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్: వెంకటగిరిలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులతో కలసి పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా ఉంటుందని వెల్లడించారు. ఐదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పీజీ అభ్యర్థులు మేళాకు హాజరుకావచ్చని వివరించారు. ఇంటర్వ్యూలకు వచ్చే వారు 10వ తేదీలోపు తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7013509543, 9491458910, 9988853335 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. డీఆర్‌ఓ నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీపీఓ సుశీలాదేవి, డీఎల్‌డీఓ నారాయణరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం,ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గణేష్ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు


బస్సు కేబిన్‌లో ఇరుకున్న క్లీనర్ మృత దేహాన్ని వెలుపలకు తీస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) క్లీనర్ ఖాదర్ (ఫైల్)


లారీని వెనుక నుంచి ఢీకొన్న బస్సు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని విన్నమాల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున బొగ్గు లోడుతో వెళుతున్న లారీని వెనుక నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ ఏక్ అబ్దుల్ ఖాదర్(40) మృతిచెందాడు. కావలి ప్రాంతానికి చెందిన బస్సు డ్రైవర్ షేక్‌గౌస్ బాషా, మరో డ్రైవర్ కే.సురేష్‌రెడ్డితో పాటు ఇంకో ఎనిమిది మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసుల కథనం.. ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి 30 మందికి పైగా ప్రయాణికులతో ఒంగోలు నుంచి బెంగళూరుకు బయలుదేరింది. నాయుడుపేట మండలం, విన్నమాల గ్రామ సమీపంలో జాతీయ రహదారి రోడ్డుపై నిలిపి ఉన్న బొగ్గు లోడు లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ షేక్ అబ్దుల్ ఖాదర్ అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సు డ్రైవర్ గౌస్‌బాషా కాళ్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాయి. అతని పక్కనే నిద్రపోతున్న మరో డ్రైవర్ సురేష్‌రెడ్డి(నెల్లూరు) తీవ్రంగా గాయపడ్డాడు. బస్సులో ఉన్న ప్రయాణికులు టీ.లక్ష్మీ(ఒంగోలు), పీ.కుమార్(కందుకూరు), ఏ ప్రవీణ్‌కుమార్(నెల్లూరు), బీ.ఈశ్వర్(ఒంగోలు), శీలుకుమార్(బిహార్), అఖిల్ (బిహార్), మరో ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. సీఐ బాబి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా క్లీనర్ ఏక్ అబ్దుల్ ఖాదర్ భార్యకు మాటలు రావు. ఆమె తన కుమారుడిని వెంటబెట్టుకుని మూగసైగలతో రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చంద్రగిరి/పాకాల : ప్రయాణిస్తున్న రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పాకాల రైల్వే స్టేషన్ నుంచి ముంగిళిపట్టు రైల్వే స్టేషన్ మధ్యలో సోమవారం వెలుగుచూసింది. స్థానిక రైల్వే పోలీసుల కథనం మేరకు, సుమారు 45 ఏళ్ల వ్యక్తి ఉదయం 10 గంటల సమయంలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడి చేతిపై దేవి అను పేరు పచ్చబొట్టు ఉందని, అతని జేబులో పాకాల–నేంద్రగుంట ఆర్టీసీ బస్ టికెట్ ఉందని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు చిత్తూరు ఇన్‌చార్జ్ రైల్వే ఎస్‌ఐ రత్నమాల సెల్ 94926 29311 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కార్మిక శాఖతో ఎస్వీయూ ఒప్పందం


ఒప్పందం పత్రాలను మార్చుకుంటున్న కార్మికశాఖ , ఎస్వీయూ అధికారులు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వ కార్మికశాఖతో ఎస్వీయూ పలు అంశాలపై పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అమరావతిలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ , కమిషనర్ శేషగిరి బాబును ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు కలిసి ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ కార్మిక శాఖ ఆధ్వర్యంలో వర్సిటీలో భద్రతా తర్ఫీదు కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఇందులో వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగుల భద్రత నైపుణ్యాలు పెంపొందించడానికి ఈ కేంద్రంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అక్రమ మట్టి తవ్వకాలపై పోలీసుల దాడి


పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు, జేసీబీ

రేణిగుంట:మండలంలోని అత్తూరు పంచాయతీ మొలగమూడి చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారంతో సోమవారం గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించి జేసీబీ 3 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.